
POETRY



Thovva

annavaram devender




ఎంత మధురం నా బాల్యం అదొక తియ్యని యాది

నా బాల్యం కొక్కెలో దుచుకున్న కమ్మని పాలగోకు

నా బాల్యం తంపిలో కాల్చుకున్న ల్యాత మక్కకంకి

నా బాల్యం కొత్తకొండ తీర్థంలో తిన్న శిల్కల పేరు

నా బాల్యం దూపకు బుడ్డిలో జుర్రిన గడ్క సల్ల



అన్నవరం దేవేందర్

# తొవ్వ

www.etelangana.org

# తొవ్వ

(కవితా సంకలనం)

అన్నవరం దేవేందర్

నూతన సాహితి
హుస్నాబాద్
కరీంనగర్ జిల్లా

www.etelangana.org

# THOVVA

Poems by **Annavaram Devender**
(1989-2001)

Publication :
'Noothana Sahithi'
17-4/5, Ananda Bhavan,
Teachers Colony, HUSNABAD.
Dist. Karimnagar-505 467. ✆ : 08721-55433

© Poet

November 2001
Publication No. 3

Cover Painting : AKBAR

Copies Available at
Vishalandra Book House, Hyderabad.
and its all Branches in AP
Prajashakti Book House, Hyderabad.
and its all Branches in AP
Navodaya Book House, Kachiguda, Hyderabad.
Disha Pusthaka Kendra, Chikkadapally, Hyderabad

and Available at **Publishers Address .**

**Rs. 15 /-**

Printed at :
Om Sai Graphics, Narayanaguda,
Hyderabad. Ph. 7560543

Type Setting :
KASTURI LASER GRAPHICS,
Tilak Road,.KARIMNAGAR. Ph. 34962

ఈ కవిత్వాన్ని అచ్చేసిన

ఉదయం, ఆంధ్రజ్యోతి, వార్త, జీవగడ్డ, సుప్రభాతం, ప్రజాతంత్ర, ప్రతిపక్షం, దళితజ్యోతి, అన్న, మానేర్‌టైమ్స్, జాతర, చర్చ, భూమిక పత్రికల యజమాన్యాలకు, సంపాదకులకు కృతజ్ఞతలు

కొన్నింటిని 'సమకాలీనం' (వంద కవుల స్పందన) 'వృష', 'సిమాంట' కవితా సంపుటాల్లో చోటుకల్పించిన బాధ్యులను నేనెట్లా మరువగలను... అందరికీ వందనాలు...

www.etelangana.org

## ఈ తొవ్వలో ...

బాల శిక్షలో దాచుకున్న నెమలి కన్ను 1 మంగులం 5
తొవ్వ 7 మట్టి పాదాల కదలిక 8 నాగటి సాల్లలో కన్నీరు 10
నా తెలంగాణ పల్లె 12 మహోన్నతున్ని నేను 14 ఆదివారం 16
త్యాగశిల 18 మనిషిలో మనిషి 20 ప్రపంచ శాంతి 21
వెన్నెలపై దాడి 23 విన్నపం 24 తల్లీ వస్తున్నాం 26
WWW.. ఇండియా.. డాట్ కామ్. 28 రహస్య యుద్ధం 30
రగులుతున్న అక్షరాలు 31 కనర్ అమెరికా 33 స్వర్ణోత్సవ
భారతీ 34 చిరునామా 37 ఆత్మవంచనా సదృశ్యం 39

# బాలశిక్షలో దాచుకున్న నెమలి కన్ను

జలపాత ప్రవాహ జ్ఞాపకం నా బాల్యం
జడివానలో మత్తడిపై అడుగులేసిన అనుభవం
రువ్వడిగా పారే వాన నీళ్ళలో చిందులేసిన నా పాదం
తూము నీళ్ళలో ఎగురుతున్న చేపలతో నా స్నేహం

ఎంత మధురం నా బాల్యం అదొక తియ్యని యాది
నా బాల్యం కక్కెలో దాచుకున్న కమ్మని పాలగోకు
నా బాల్యం తంపిలో కాల్చుకున్న ల్యాత మక్కకంకి
నా బాల్యం కొత్తకొండ తీర్థంలో తిన్న శిల్కల పేరు
నా బాల్యం దూపకు బుడ్డిలో జుర్రిన గడ్క సల్ల

ఎంత గొప్ప జ్ఞాపకం నాబాల్యం,
అదొక విరబూసిన సింగిడి
ఎర్రటి ఎండలో త్కెట్టె బాయిల ఈత ఎంత చల్లదనం
మోట చిమ్ముల నుంచి డై కొట్టి దునికిన దుడుకుదనం
పల్లేరుగాయలు, దుబ్బతుత్తుర్లు కాళ్ళకు అంటుకున్నా,
గయ్యితో ఎగిరెగిరి తెంపుకు తిన్న పులిశింత కాయలు
పరికి పండ్లు, బల్సుకు పండ్లు, చింత చిగురు
ఎన్ని తిన్నం... ఎంత ఎగిరినం... ఎంత ఆడినం...



www.etelangana.org

కోతులా కొండెంగలా? ఏం ఎగురుడ్రా!
అన్నా వినకుండా ఎన్ని ఆటల పాటలు

"అలెంకీలెంక. . .చంద్రవో లెంక. . .
ఆ. . .వాన్ని కాదు వీన్ని కాదు. . ."
అనగానే బాతదాటి పరుగుదీసిన చురుకుదనం

అమ్మ వద్దురా బిడ్డా ! అన్నా వినకుండా
చింతకిందికి పోయి సోపతిగాళ్ళతో చిర్రగోనె ఆట

"ఓంటేకాల్, రెండో సిచ్చి, మూడోముచ్చి, నాల్ నడ్డి
అయిదర పెద్ది, ఆరెగన్ను. . .పోరేగాడు. . .పిల్ల"

ఎన్ని పిల్లలు.. ఎన్ని ఆటలు
ఎన్ని పొట్రౌతులు.. మరెన్ని గాయాలు
ఆ గాయాలకు అద్దుకున్న నల్లారం పసరెంత?

దాగుడుమూతల ఆటలు, వంగుడు దునుకుడు
బొంగురాల ఆటలు, గోటీల ఆటలు

అబ్బా!
నేను మరోసారి పోరన్ని అయితె ఎంత బాగుండు

తాటి కమ్మలతో చేసికున్న
గాలిగిర్క ఉరికిన కొద్దీ తిరుగుడు
సొప్పబెండ్లతో చేసికున్న సవారి కచ్రం
కుమ్మరి మన్నుతో చేసికున్న గంగెడ్ల బొమ్మలు
బుడిమెకాయలకు చీపురు పుల్లల కాళ్ల ఎడ్లు
వాయిలి కట్టెలకు తాటి గిరెలు కట్టి ఊరంతా తిరుగుడు



వాన నీళ్ళకు ఉస్కె కట్టకట్టి చేసికున్న చిన్న చెరువు
దానిలో వేసిన కాయిదం పడవలు,
ఆ చెరువుకు మర్రాకు తూము

నాబాల్యం ఎంత సృజనాత్మకం? ఎంత కళాత్మకం
కట్టుకున్న బొమ్మరింట్లో బువ్వంట కూరంట ఆటలు
బొడ్డుగురిడిలో తాగిన మంచినీళ్ళు ఎంత తియ్యగా
తంగెడు తోడ్కలతో చేసిన పీకెల పలుకులు
ఏరుకున్న పాలరాళ్ళతో ఆడుకున్న కచ్చగాయలు
చింత గింజలతో ఆడుకున్న ఓన గుంటలు
పులిజూదంలో ఓడిపోయిన క్షణాలు
మళ్ళీ తొండాట ఆడి గెలిచిన పొగరు

నేనొక స్వేచ్ఛా జీవిని ఎగిరే రామచిలకను
నాదొక పంచ వన్నెల చిన్నారి తనం
అగ్గిపెట్టెలో భద్రంగా దాచుకున్న బంగారి పురుగు
దాని రెక్కల శబ్దం ఒక సంగీత తరంగం
నేలపై రాజసంగా నడుస్తున్న ఆరుద్ర పురుగులు
వాటిని ముట్టుకొని చూస్తే ఎంత మురిపెం
ఇసుక తెన్నెలపై కట్టుకున్న పిట్టగూల్లు
వాన తుంపురకు నేల రాలినట్లే
మా బాల్యం - మా కళలు మాపిల్లలకేవి?

రిమోట్ కార్లు, లియో బొమ్మలు, వీడియో గేములు
సృజనకు తావీయని టివి సీరియల్లు, మోతకోలు పుస్తకాలు
వడ్ల బ్రహ్మయ్య చేసిన మూడు గిరెల బండ్లేవి?

కాముని పున్నం ఎన్నెల రాత్రుల్లో



www.etelangana.org

"రింగుడు బిల్ల. . .రూపుడు దండ. . .దండ కాదురో. . .
దామెర మొగ్గ. . .మొగ్గ కాదురో. . .మోతుకు నీడా. . .
నీడ కాదురో. . .నిమ్మల బావి. . .బావి కాదురో. . ."
అన్న ఆ పాటల ఆటల కోలాటాలేవి?

సద్దుల పండుక్కు తంగెడుపూలకు పోయి
కాపోని కంచెల దెబ్బలు తిన్న జ్ఞాపకం
గునుగుపూలకు రంగులద్ది,
గోరంట, బంతిపూలతో పేర్చుకున్న
పెద్ద బతుకమ్మ..ఆ!.. ఎంత పెద్దది?
"బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో!
బంగారి బతుకమ్మ ఉయ్యాలో!. . .
ఇద్దరక్కా చెల్లెండ్లను ఉయ్యాలో..
ఒక్కోరికిచ్చిరి ఉయ్యాలో.."

సద్దులెనుక వచ్చే దసరగోలెకు
పాల పిట్టను సూడబోవుడు ఎంత గమ్మతి

అస్సోయ్ దూలా. . .అస్సోయ్ దూలా. . .దూలా. . .దూలా
అస్సోయ్. . .అస్సోయ్. . .అస్సోయ్. .దూలా. .దూలా

నా బాల్య జ్ఞాపకం అద్భుతమైన ఆనందం
అది రామసక్కదనమసొంటి అందం
అది చందమామలాంటి చల్లదనం
నా బాల్య జ్ఞాపకం
నేను
బాలశిక్షలో దాచుకున్న నెమలి కన్ను వంటిది

అగస్టు 26-2001



# మంగులం

కడుపులో గడ్డపారలు వదేసినట్లు
గుండెకాయ కెల్లగించిన నొప్పి
కనుగుడ్లల్ల పచ్చబొట్లు పొడిచినట్లు బాధ
మనస్సు కలికలి అయ్యింది
తీరొక్క బాధలతో
నన్ను మంగులంల ఏంచుతున్నరు

మా ఊరి భాష మరిపించి
మీ శాని యాసతో
చెవుల్లో జోరీగలా గుయ్యిమన్నావు
నాబాష నాకు కన్నతల్లి
నా మాండలికం తల్లివేరు వంటిది
మా పండుగలు ఎండగొట్టి
మీ పబ్బాలు గడుపుతున్నవ్
మా నీళ్ళు మర్లగొట్టి
మీ దొయ్యలు పారిచ్చుకున్నవ్



www.etelangana.org

కొలువులు చదువులు
గద్దోలె తన్నుక పోయినవ్
మాకరెంట్ మాకు గాకుంట చేసినవ్
బల్లు, కాలేజీలు, బస్సులు, రైల్లు
అన్నిట్లా నీదే పెద్దపాలు
రేడియో, టీవీ, సినిమాల్ల వయిలల్ల
యాడ చూసినా
నీయాసే, నీ బాషే

మా ర్యాగడి భూములన్నీ, గుంజుకున్నవ్
మాకు నీళ్ళ పారకమే తక్వ
ఉన్నకాడికి నీవే గొంగడి జాపినవ్

పట్నం సుట్టూ బారాన వంతు
కనీలు పాతుకున్నవు
ఇంక మాకేం మిగిలిందని

నన్ను నన్ను గాకుండా చేసితివా
కొడకా!
కడుపుల తకపెక ఉడుకుతుంది
నా సూరునీడకు ఉండి
నా మోచేతి నీళ్ళు తాగి
నానిట్టాడు ముంచి
తిన్నింటి వాసాలు లెక్కపెడతావా?
నిన్ను తన్ని తరిమి కొడతాం

అక్టోబర్ 17-2001



# తొవ్వ

నేను నడుస్తున్న దారి
చెమట చుక్కల పరిమళం
నడిచి వచ్చిన బాట
నెత్తుటి ప్రవాహం
నా పానాది నిండా
కత్తులతో కరచాలనాలు
గబ్బిలాల పలకరింపులు
గుడ్లగూబల గుసగుసలుంటాయి

కోయిలల గానాలుండవు
రంగురంగుల పూల మకరందాలుండవు
దారి పొడవునా
కావు కావుమనే కాకుల గానం ఒలుకుతుంది
నేను కన్నీటి వానలో నాని వచ్చాను
నేనంతా చెమటతో తడిసి పోయాను
కటిక చీకటి కోనేరు దాటి
వస్తున్న తొవ్వలో
పల్లేరుగాయలు మంగతుమ్మ ముండ్లు
నా కాళ్ళను గాయాలు చేస్తున్నాయి
ఆ మట్టి పాదాల నుంచి
ఎరుపెక్కిన నెత్తురు రాలుతుంది

నా జెండా ఆకలి పేగుల అలికిడి
నా గమ్యం నల నల్లాని సూర్యుడు

18-3-1999



www.etelangana.org

# మట్టి పాదాల కదలిక

నేల పొరల్లోంచి పుట్టిన
మెరుపు తీగను నేను
మట్టి పాదాల మహా కదలిక ఇది
నాపేరు ఉనికి, ఆత్మ గౌరవం
మీ వర్ణ ధర్మాలకు బానిసనయ్యాను
మీకర్మ ప్రచారాలకు బలికాబడ్డాను
వేయి తలల హైందవ నాగరాజు కాట్లకు
మేం శూద్రులం, అంత్యజులం, పంచములం
మీ దయ్యాల వేదాలు వింటే
చెవుల్లో సీసపు లోహం పోశారు
చదువుకున్న పాపానికి
పంచములని నాలుక తెగకోసారు
అంటరాని వర్ణం మాదని
మా పాదముద్రలు పడకుండా
వీపుకు చీపురు కట్టారు
ఉమ్మి నేలపై పడరాదని
మూతికి ముంతలు కట్టారు

నీ మనుధర్మం మంట్లె కలిపేందుకు
ఉవ్వెత్తున వస్తున్నారు నావాల్లు



బీటలెత్తిన కడుపు బీల్ల నుంచి
నెర్రెలిడిసిన నల్ల రేగల్ల నుంచి
దండోరాతో వస్తున్నాం

ఇప్పుడు నేను
రాముని బాణాన్ని విరిచే శంభూకున్ని
లక్ష్మణుని చెవులు కోసే శూర్పనఖను
ద్రోణుని ద్రోహాన్ని గుర్తించి
బాణం సంధించిన ఏకలవ్యున్ని

నేను
చార్వాకున్ని, లోకాయతను, సత్యకామజాబాలిని
కంచికచెర్ల కోటేశును నేనే
నిన్నటి కారంచేడు ఎలీషమ్మను నేనే
సజ్జలగూడెం మహదేవమ్మను
చుండూరు, నీరుకొండ, ఇంద్రవెల్లిని నేను

నేను
మాదిగ డప్పు చప్పుడును
మండుతున్న కమ్మరి కొలిమిని
గిరగిర తిరిగే కుమ్మరి సారెను
ధగ ధగ మెరుస్తున్న మంగలి కత్తిని
జాలరి వలను, సాలెల మగ్గాన్ని
సమస్త వృత్తుల ఆత్మ గౌరవాన్ని
కత్తి, ఆరెలు పదనుతేలినయ్
ఇది మట్టి పాదాల మహా కదలిక -
మమ్మల్నేం చేయలేరు మీరిక

ఏప్రిల్ 1-1995




www.etelangana.org

# నాగటి సాల్లలో కన్నీరు

ఎండిన డొక్కల్నుంచి రాలిన స్వేదం
గుండె గాయాన్నుంచి చిమ్మిన నెత్తురు
ఉబికిన నేత్రాలు రాల్చిన కన్నీరు
నేల నలు చెరుగులా
నాగేటి చాల్లలో ధారలవుతున్న సన్నివేశం

ఆకలి వధ్యశిలపై మృత్యువు
ఎండిన పేగుల్ని శిల్పీకరిస్తున్న నేపథ్యం



పురుగుమందులు పుట్టలు పుట్టలుగా
పురుగుల్ని చంపలేకున్నా
మనుషుల్ని చావు ఊబిలోకి దించడం
సహకార అప్పు నోటీసు
రైతు మెడలో ఉరిత్రాడై
మృత్యువును క్రీడించమంటుంది

వినీలాకాశంలో ఎంతకూ రాలని మబ్బు తునకలు
రానున్న రాకాసి కరువు చిత్రాన్ని చిత్రీకరిస్తున్నాయి
కరెంటు కోతతో ఉన్న రెండు కోండ్రలు ఎండినప్పుడు
రైతు పొట్టమీద అప్పు కరాళ నృత్యం చేస్తుంది
కాలిన మెటర్ రాగివైరు రైతు పాడెకు త్రాడవుతుంది

వెన్నెముకలను అంగట్లో వేలం వేసిన
ఈ పరాధీన భారతం రుణభూమిలో ఇంకి
క్లింటన్ 'అడె' అంటె ముందుకు
డంకెల్ 'శెరి' అంటె వెనక్కు
అయ్యా బాంచెన్ అన్న రీతిలో పులకరిస్తుంది

కన్నీటి ప్రవాహంతో నిండిన
నాగేటి చాల్లలో
నెత్తుటి ముద్దలు కురుస్తున్నాయి
బక్కరైతు గుండెల్లో బడబాగ్ని పేలింది
కరువు రైతు కన్నుల్లో
మోదుగుపూలు విచ్చుకున్నాయి

సెప్టెంబర్ 22-1993



www.etelangana.org

# నా తెలంగాణ పల్లె

కనుకొనల నుంచి రాలుతున్న సముద్రం
తెలంగాణ పల్లె
ఇది కన్నీళ్ళ కోనేరు
ఒకవైపు
ఉడుకుతున్న నెత్తుటి సంగీతం
మరోవైపు
రివ్వుమంటున్న బుల్లెట్లవాన
ఊగుతున్న ఉరి తాళ్ళ చప్పుడు
బక్కచిక్కిన బతుకుల్లో ఆత్మహత్యల సన్నివేశాలు
రైతు జీవితాలు
పిల్లిపట్టిన కోడిపిల్ల వైనం
కుక్కుడు పట్టినపెట్టోలే చీదర
పొద్దు గూకులా రెక్కలు ముక్కలు చేసికొని
ఎలుగటి నాగండ్లకు శిలువ వేయబడ్డ దృశ్యం



పాతాళంలోకి ఇంకిపోయిన నీళ్ళు
కండ్లల్ల వత్తులు ఏసి చూసినా
తిండికి కుంచెడు గింజలు రాలక
గంజుకు పోయిన రైతుల డొక్కలు
పచ్చని ఆకుల్లోని పత్రహరితాన్ని
బహుళ జాతి కంపెనీలు
సరళీకృతంగా అరగించి
బక్క ఆసాముల మెడకు విషపు
హరాలు వేస్తున్నాయి.

పల్లెనేడు
వెయ్యివక్కలై గుండెచిల్లులుపడి
ఎక్కెక్కిపడి ఏడుస్తున్నది
ఎటు చూసినా ఏడుపులు పెడబొబ్బలు
మృతదేహాలు మృత దేహాలు
నేల కొరికిన వీరుల తల్లుల రోదనలు
చావుల సన్నివేశాలతో
కకావికలమవుతున్న డాక్యుమెంటరీ దృశ్యం
నేటి తెలంగాణ పల్లె

నా పల్లె
రెక్కలు తెగి పడ్డ గువ్వ
కచ్రం బండి
కమ్ముకూలిన నేపధ్యం
నా ఉరు

ఏప్రెల్ 1998



www.etelangana.org

# మహోన్నతున్ని నేను

చరిత్ర శకలమా! నీ పుటలన్ని తిరగేస్తున్న
కాల చక్రమా కొత్త చరిత్రను రాస్తున్న
తరతరాల మా సేవలన్ని తర్కిస్తున్న
మహోన్నతున్ని నేను మహా మానవున్ని నేను

చంపిన ఎద్దునుంచి తోలుసాగ దీసి
తొడం ముడిచాను చెప్పులు మలిచాను
దండెడ పేనాను దండోరా వేసాను
సంపదలన్ని సృష్టించిన శ్రామికున్ని నేను
చరిత్ర శకలమా నీ పుటలన్న తిరగేస్తున్న

దూదిపింజం నుంచి దారాలన్నీ చేరదీసి
పోగుపోగుగా వడికిన నేను
విశ్వమానవులకు వస్త్రాలందించిన వాన్ని
మహోన్నతున్ని నేను మహోమానవున్ని నేను

మలినంతో నిండిన బట్టలన్నీ
జిగేల్మని మల్లెలవలె మెరిపించే మార్తాండున్ని నేను
మహా మానవున్ని నేను



మానవ నాగరికత వికాసపు వెలుగు పులుగును
మట్టిపిసికి పాత్రలుగా మలచి
మణిక్యాలు సృష్టించిన కళాకారున్ని నేను
మహోన్నత మానవున్ని నేను

చెదిరిన రోమాలన్ని కత్తెరతో కళాత్మకం చేసి
మంగళ వాయిద్యాలు వేసే మేస్త్రిని
కష్టమనే తత్వమున్న మహా మానవున్ని నేను

ఎర్రని కొలిమిలో రంగరించిన ఇనుముతో
కత్తులు కొడవండ్లు సానపెట్టిన కర్మ వీరున్ని
వైజ్ఞానిక శాస్త్ర సృష్టకర్తను

నేతల వస్త్రాలన్నీ శరీరాకృతిలో కత్తిరించి
అంగోస్త్రాలందించే మేర నగధీరున్ని నేను
భారత మూల వాసున్ని, నేను
అవును !
కాల చక్రమా! చరిత్ర శకలమా!
నేను కాక మహోన్నతుడెవరు?
'భక్తిమార్గం' 'పుణ్యతీర్థం' పేరుతో మమ్మల్ని
మసిపూసి మాకు తారు రాసిన వాడా
వాడొక పరాన్న జీవి
తోకపేర్లతో శ్రమకు దూరమైన వాళ్ళా!
వాళ్ళా పరాన్న భుక్కులే
మా చరిత్ర పరిశోదన సాక్షిగా
చరిత్ర పుస్తకమా నీవు పునరుద్ధరించుకో . . .

మార్చి, 2000



www.etelangana.org

# ఆదివారం

రాలిపోతున్న రోజులకు విరబూసిందొక ఆదివారం
కరిగిపోతున్న కాలానికి వారాంతం ఒక విరామం
ఆదివారం ఉత్సాహం నింపే ఉరడింపు
ఆదివారపు విరామం మరో వారంకు ఉత్తేజం

ఆదివారం ప్రత్యేక సంచికల సాహిత్యం
ఉదయం పూట బుర్ర నిండా తినే ఉపాహారం
కథలో కవిత్వమో గెలకడమూ ఆదివారం నాడే

ఆదివారం రోజే
ఎక్కడెక్కడో సాహిత్య సభలు సామాజిక సదస్సులు



మిత్రులను ఉత్తరాల్లో పలకరించడం ఇదే రోజు
అల్బమ్‌లోని జ్ఞాపకాలను యాదికి చేసికోవడం ఈనాడే

ఇలాంటి ఆదివారాలు
ఎంత హాయి ఎంత మధురం
ఎవరి ఆదివారం వారే తీర్చిదిద్దుకున్నట్లు
పిల్లల ఆదివారాలు ఆటపాటలే కోటలు
చిలక్కొయ్యకు హోం వర్క్ గిరాటేసి
మైదానంకు పరుగులు దీసే చిన్న చిన్న పాదాలు
టి.వి.లోని కార్టూన్ ఫిల్మ్‌లకు కళ్ళు అతికిస్తారు.
పిల్లలు ఏ సెలవైనా బాల ఆదివారం చేస్తారు.

ఇల్లాల్ల ఆదివారాలు ఇంపైన కష్టాలే
ఇండ్లు కడుగటం, బట్టలు సదరడం వంటలు పిండి వంటలు
ఇడ్లీలు, చట్నీలు, చికెన్, మటన్‌ల ఘుమ ఘుమలు
ఆదివారం పని పెరిగినా కుటుంబంతో కల్సి ఉండే అనందం

విరామం దొరికిన ఆదివారం రోజు
మధ్యాహ్నపు సుఖనిద్ర
సాయంత్రం జారుకు పచారు సినిమా షికారు
స్నేహితులతో కరచాలనాలు చాయలు చప్పరించడాలు
ఇవేకాదు
షెల్ఫ్‌లో పుస్తకాలు సర్దమంటాయి చదవ మంటాయి
గోడలకున్న బల్లి పాతర దులపమంటుంది
ఎండిపోతున్న మొక్కలు నీళ్ళకోసం నావంకే చూస్తాయి
ఇలనా ఆదివారం ఒక విరామం ఒక ఉత్తేజం

సెప్టెంబర్ రెండో ఆదివారం, 2001.



www.etelangana.org

# త్యాగశిల

నీలాకాశంకు నిటారుగా ఎగిసిన
స్మృతుల కెరటపు శిల్పం
నీగమనం గాయాల త్యాగాల మయం
నీ గమ్యం నవ్యమానవత్వం
మరణమే లేని మరణాల స్మృతిని నీవు

చిమ్మిపడ్డ రక్తంతో
గడ్డకట్టిన నెత్తుటి గుట్టవు నీవు
నీలో ఎంత మంది
తల్లుల కడుపు కోతలు కలుపుకున్నావు



ఎంత మంది పిల్లల
గుండె చప్పుల్లు నింపు కున్నావు
నీలో
ఎన్ని సముద్రాల కన్నీళ్ళు మత్తళ్ళు పడుతున్నాయి
ఎంత రక్తం ప్రవహిస్తుంది
గగనంకు ఎగిసి పడ్డ
ఓ త్యాగశిలా !
నిన్నెట్లా శిథిలం చేశారు
ఆలోచనలంటే పిరికిపడేవాల్లు
కదలికలంటే కలత చేందేవారు
శిలనెలా శిథిలం చేశారు?
తలల కోసం తిరిగే తలారిలకు
ప్రాణం లేని శిలలంటే భయం ఎందుకు?
కన్నీల వాగును ఆపేందుకు
ఇక్కడ ఎంత చెమట ఇంకి పోయింది.
రాలిపడిన శిరస్సులెన్ని
అవి తేల్చిన చిరునామా లెక్కడ ?

చీకటి చంద్రులకు
మరణమే అవాంచిత రోమం
మరణమే లేనివారికి మరణ స్మృతి ఎందుకులే?

నిత్యం మనోస్మృతిలో కదులుతున్న
శిల్పం నీవు శిరస్సు నీవు
శిథిలమే కాని శిలువవు నీవు

జనవరి 3-2000 రాత్రి



www.etelangana.org

# మనిషిలో మనిషి

మనిషిలో మనిషుంటాడు
మనిషిలోనే మరో మనిషుంటాడు
పైకి మంచి మనిషే... లోనంత విషం
పెదవులపై చిరునవ్వుల దరహాసం
హృదయంలో కుటిల విలాపం
స్నేహంచే కరచాలనంలోనే
గోతులు తవ్వే గునపాలుంటాయి
పైకి మేడి పండులా కన్పించే
మనిషిలోనే
విస్ఫోటనం చెందే విధ్వంసం ఉంటుంది
అంతర్లీనంగా నెత్తురులో
స్వార్థం బుసలు కొడతూ ప్రవహిస్తుంటుంది
అంతర్మదనంగా గుండె లయలో
అసూయల శబ్దం చేస్తుంది
మనిషిలోని క్రూరత్వం
అది ఎక్స్‌రే ఫిల్మ్‌కు అందదు
మనిషిలోని మృగం
అది స్కానింగ్‌కూ చిక్కదు
చేయి సాచే నమస్కారాల మస్కాలు
హల్లోల అలల వెనుకనే
కల్లోలాలు సృష్టిస్తారు

జనవరి 22-1995



# ప్రపంచశాంతి

ప్రపంచ మొక ప్రచండ ప్రవాహం
ప్రశాంత మొక చాలని చెలిమె దాహం
ఎండ మండి తేనే వెన్నెల చల్లదనం
సలిపే పుండులోంచి చీము తీస్తేనే కదా !
ఆయాసం పోతుంది
ఆకలి కోసం పోరాటం అనివార్య మైనప్పుడు
మాడిన కడుపెలా శాంతి పావురం ఎగిరేస్తుంది



www.etelangana.org

ఆకాశం నుంచి బాంబులు వర్షిస్తున్నప్పుడు
జీహాద్ ప్రకటించకుండా శాంతి ఎలా సాధ్యం
మూలాల్ని చేదించి నిలువునా ముంచిన వాన్ని
పాతర పెడితేనే ప్రపంచ శాంతి

అహింసా మంత్రం కొంగజపం
ప్రచారంకు తప్ప చరిత్ర కెన్నడూ నిలువలేదు
అణిచివేత అమాంతం ముంచుకొచ్చి
ఒక చెంప దెబ్బపడితే మరో చెంప చూపించడం కాదు
ఆ చెయ్యి ఒక్క పెట్టున నరికెయ్యాలి
అప్పుడే ప్రశాంతత

అగ్రరాజ్యాలు చిన్న రాజ్యాలపై దండెత్తుట
పడగ విప్పి బుసలు కొడుతున్న సామ్రాజ్య వాదం
దేహమంతా క్యాన్సర్‌లా విస్తరిస్తున్న కన్స్యుమరిజం
ఉగ్రవాదం ఉగ్రపెత్తనం దాలిస్తే !
శాంతెక్కడ ?
కంటిలో నలుసు సలపనిదే శాంతి లేదు
చెవిలో జోరిగను చంపనిదే ప్రశాంతి లేదు
నిన్ను దహింప చేస్తున్న వాల్లపై
యుద్ధం చేయకుండా
శాంతి లేదు
ప్రశాంతి లేదు
ప్రపంచ శాంతి లేదు
ప్రపంచ శాంతి వర్ధిల్లాలి

అక్టోబర్ 28-2001



# వెన్నెలపై దాడి

పండు వెన్నెల పలకరింపుతో
అడవి తల్లి పులకరిస్తుంది
రెక్క విదిల్చిన విహంగం
నింగి కేగిన వేళలో
అడవి తల్లి ఒల్లు విరుచుకుంది
ఇప్ప పువ్వు కుంకుళ్ళ కోసం విప్పారిన నేత్రాలు
కందములాలు, జింక కొమ్ముల
కోసం గాజుల గలగలతో
తెల్లవారింది

బరాయిగడ్డలో ఓటేయ లేదని
కాంగి'రేచు'లు కాటేసాయి
నర్సంపేటలో సారా దొరలు
ఇప్పపువ్వుల్ని చిదిమేసాయి
అలజడి సవ్వడితో
దిక్కుతోచని హరిణి పరుగులు
గూడు వదిలిన చిలకా గోరింకలు
కీకారణ్యంలో విలపిస్తున్నాయి
అడవి వెన్నెలపై పువ్వులపై
అత్యాచార పద ఘట్టనలతో
ఆకులు నేల రాలాయి

జనవరి 1999



www.etelangana.org

# విన్నపం

అబ్బ
గాఢ నిద్రలోనున్న
నా ప్రభువు
సంపూర్ణ అక్షరాస్యతనీ కలవరిస్తున్నాడు
కల గన్నాడేమో
చదువు సంధ్యలు లేని జనం
కత్తులు నూరుతున్నారని
కోలాటాలేస్తున్నారని

అందుకేనా ప్రభువా
బందీ ఖానాల్లోని నా అక్షరాలు
విముక్తమవుతున్నాయి
ప్రభు
కుంభ కర్ణ నిద్ర నీది
కౌటిల్య నీతినీది
చాతుర్వర్ణ వ్యవస్థలోని
మనుధర్మం నీది

విద్యాగంధం అంటని జనమే
ఆకలి చావుల నుంచి
అగ్రవర్ణ కండకావరాల చుండూరు నుంచి
అత్యాచారాల పద ఘట్టనలో



విసిగి ఎగిసి పడి
జనం గంధకం అవుతున్నారు
ప్రభువా !
చిత్త శుద్ధే కాదు చిత్తం లేని నీకు
మేమిచ్చే విన్నపం ఇది
నీ ప్రజలు అక్షరాస్యులవ్వాలనే ఆవనీకుంటే
ఊరూరా వాడ వాడలా
అన్ని వసరులతో విద్యాలయాలు స్థాపించు
నా దేశంలో
పంతుల్లేని బడులు
సుద్దముక్కల్లేని గదులు
కోకొల్లలు
ప్రభువా !
సీట్లురాక ఫీజులు లేక
మా పిల్లలు బడిమానుకుంటే
మమ్మల్ని అ,ఆ లు నేర్చు కోమంటున్నావు
ఏటా ఎన్నివేల మంది
బడిమాను కుంటున్నారు?
నిన్ననే నిద్ర మేల్కొన్న ప్రభువా
నీ
ఊసుకళ్ళను తుడుచుకో
నీ
సొల్లు గారిన చెంప కడుక్కో
రాజ్యాంగం అంతరంగం తెల్సింది
చట్టాల లోగుట్టులు తెల్సినయి

అక్టోబర్ 2-1991



www.etelangana.org

## తల్లీ వస్తున్నాం

తల్లీ
నీ రూపం
నీవేషం
నీ బాష్యం
నీ కన్నటి బాష్పాలు
నీ బతుకు విరిచే పరువాలు
నీవు కన్న కలలు



నీవు వూహిస్తున్న మధుర స్మృతులు
నీ ఆలోచనా వసంత పుష్పాలు
నీ ఊహల కెరటాలు
ఒక్కొక్కటి పగిలిన అద్దంముక్కై
నానిన మట్టి పెడ్డవలె
ఒక్కొక్కటి నేల రాలుతుంటే
ఉబికిన కన్నీళ్లను అదుముకుని
పగిలే గుండెలను చేత బట్టుకొని
అరువుకు తెచ్చిన గాంభీర్యంతో
తల్లీ నీవు
వివస్త్రవై
ఒంటరివై
వికారివై
బికారివై
అర్థ రాత్రి స్వతంత్ర్యంలో
అంధకార చరమ రాత్రిలో
తల్లీ నీవు
నీ బిడ్డల కన్నీళ్లని చూస్తూ
నీ బిడ్డల అర్తనాదాలు వింటూ
నీ బిడ్డల ఆకలి కేకలు వింటూ
నట్టింటిలో
కాలుగాలిన పిల్లివలె తచ్చాడుతున్నావు

9-2-1998న రిక్కల సహదేవ రెడ్డితో కల్సి 'సాహిత్య వేదిక'లో
వచ్చిన బొమ్మకు స్పందన



www.etelangana.org

# WWW ఇండియా... డాట్ కాం...

నన్ను నేను పొలిమేరల్లో పారేసుకొని
నాతల కాయ జేబులో నిక్షిప్తం చేసుకున్నాను
ఓరి దేవయా ! నువ్వు అమెరికాకు పోకురా అని
మా తాత ఎంత కసిరిచ్చినా
గెండెను కుదున పెట్టి-సైబర్ లైఫ్‌ను కలగన్నాను
ఇక్కడంతా సైబర్ నవ్వులు - డాలర్ పువ్వులు
మేం హృదయాలతో ఉదయించం
ప్రేమ లేకున్న కంప్యూటర్‌కు ప్రాణం ఉన్నట్లే
మా ఆత్మలన్నీ మూట గట్టి
అటుకు మీద దాచిపెట్టిన వాల్లం కదా!
అంతా 'ఈమెయిల్' డాట్ కామ్‌ల దర్వాలే
పిట్‌బర్గ్‌లో మా బాపమ్మ యాదికస్తే
కుమ్మరి కనకమ్మ @ యాహూ...డాట్...కాం...అంటా
తెరమీదికి మా ముసలమ్మ వచ్చి
నేను కన్ను మూసినంక నన్ను సాగనంపక పోతివా
దేవిగా! అంటూ
బ్రౌజింగ్ చేస్తున్న నన్ను పొడుస్తుంది
'పాలగోకు' తింటావా పిలగా అంటూ
కళ్ళతో నోట్లా పెట్టినట్లే కన్పిస్తుంది
పీరిల పండుక్కు మలీల ముద్దలు
తినిపించినట్లే తెరపై కదలాడుతుంది
కాని ఏం చేయను మా బాపమ్మ పోయింది
నేను ఇండియాకు వెళ్ళలేదు



అంకుల్ శామ్ నన్ను పంపించలేదు
నక్కా నాగలోకం లెక్క
ఎక్కడి మా 'పోతారం' ఎక్కడి 'పిట్స్‌బర్గ్'
మా లెక్కలన్నీ డాలర్లు డాలర్లు డాలర్లే కదా
నన్ను కన్న నాపల్లె రొంబొచ్చి గుద్దుకొని రోదిస్తుంది
మాతాత వానిన కుమ్మరి సారె విరిగిపోయింది
ఇవేవి నా కంప్యూటర్ తెరపై కన్పించవు
నా చుట్టూ ఎసి కార్లు ఇంటర్నెట్ తెరలు
ఇన్ఫర్మేషన్ విప్లవాలు పరిభ్రమిస్తున్నాయి
ఇన్ని ఉన్నా నాతాత గుర్తుకస్తే
చెదిరి పోయేందుకు నాకు మనస్సు లేదు

కుమ్మరి మల్లయ్య @ యాహూ...డాట్...కాం...అంటే
చల్లని వెన్నెలతో గడెంచపై కూర్చొని
శాత్రాలు చెప్పతున్న తాత కండ్లల్ల మెరుస్తున్నాడు
ప్రాణం అవుశ పోతుంది
నేను అమెరికాకు ఎగిరి రాగా
తాత ఎక్కెక్కి ఏడ్చిండు
బాపమ్మ అయితే శోకమే పెట్టింది
ఇక్కడ ఏడుస్తామంటే కన్నీరే లేదు
ఆత్మీయత అక్కడే వదిలేసాను

ఇంత ఆలోచన నాకెందుకు
నాకు డాలర్లు కావాలి డాలర్లు
కన్నవారు వద్దు అమెరికానే హద్దు

మార్చి 2001




www.etelangana.org

# రహస్య యుద్ధం

లోహ ఫిరంగులు నింగి నుంచి రాలుతున్నాయి
ఇనుప రెక్కల క్షపణులు తలచుట్టూ పరిభ్రమిస్తున్నాయి
వేల వేల శతఘ్నులు ఇలా దూసుక వస్తున్నప్పుడు
యుద్ధం చేయక తప్పదు, తలపడకా తప్పదు
జీవితాన్ని జీవించడానికే యుద్ధం కావాలి
యుద్ధ విద్రోహుల అంతం వరకూ యుద్ధం చేయాలి
అధిపత్య వాదులకు యుద్ధం ఏక ఆట
బాంబుల మోత వానికి శాడిజానందం

విరామమెరుగక విమానాలు మృత్యు శకటాలు రాలుస్తున్నాయి
పసిపిల్లలు సైతం హాహాకారాలతో మసైనప్పుడు
చివరి కంటా రణం చేయడమే ధర్మం
బట్ట పొట్టకోసం నిత్యం పోరాటం చేసినట్లే
బతుకు కోసం యుద్ధనౌకల మవుదాం
విరబూస్తున్న మన జీవితాల్ని
చిదుముతున్న వాన్ని తరుముదాం
పీడితులమంతా సంఘీభావమై సమరం చేస్తాం
కాబూల్ పర్వత శ్రేణుల్లో, కార్గిల్ మంచు కొండల్లో
పాలస్తీనాలో, లెబనాన్‌లో
ఎక్కడైనా ఎప్పుడైనా
మనిషితనం కోసం బతకాల్సిందే
రహస్య యుద్ధం చేయాల్సిందే

అక్టోబర్ 30-2001



# రగులుతున్న అక్షరాలు

బందీఖానాల్లో బందీలైన అక్షరాలు
కన్నీటి సెలయేరుల్లా రాలుతున్నాయి
వేదనతో అలుముకున్న అక్షరాలు
ఆకలితో మండు తున్నాయి
అక్షరాల్ని మాకు అందనీయకుండా
చేసే నీ దుర్మార్గం
అంతర్జాతీయంగా మెరిసిపోతుంది
నాలుగు దశాబ్దాలుగా అక్షరాల్ని



www.etelangana.org

మా చెంతకు చేర నీయని
నీ దున్న పోతుత్వం
పార్లమెంట్ పడగ నీడన
నీ పదవి బుస కొట్టింది

అసలు !
మాకు చైతన్యం వద్దు
మాకు ఆలోచనలూ వద్దు
అక్షరాలా మాకు అక్షరాలే వద్దు
అక్షరాలతో ఆలోచన మాకెందుకు
మాయల ఫకీర్ ప్రాణం
ఏడేడు సముద్రాల ఆవల మర్రి చెట్టులో ఉన్నట్లు
మీ పదవి ప్రాణం
మా బ్యాలెట్ బాక్స్‌ల్లో ఉంది
విద్యాగంధం అంటని మా వేలి ముద్రల్లో ఉంది

మాకు అక్షరాలు వస్తే
మేం ఆలోచిస్తాం
మాకు అక్షరాలు వస్తే
మీ రంకు బొంకుల్ని ప్రశ్నిస్తాం
మేక తోలు ముసుగు తీసేస్తాం
మిమ్మల్ని నగ్నత్వం చేస్తాం
నీవు నిర్బంధించిన నా అక్షరాలు
నేడు జనంలో రగులు కొంటున్నాయి
రణ నినాదంతో అక్షరాలు
కదం తొక్కుతున్నాయి.

సెప్టెంబర్ 10-1990



# కనర్ అమెరికా

నెనరు లేని కనర్ అమెరికా
ఎగిరిన నీ పొగరు పతాకం
నేల రాలింది
అగ్రరాజ్యమనే ఉగ్రహింసకు
ఇరాక్‌లో ఎన్నివేల పసిపిల్లలు కన్నుమూసారు
ట్రిపోలిలో పారిన నెత్తురు నదులెన్ని
పాలస్తీనా ప్రజలపై నీ ఇజ్రాయిలీ హింస
కంపూచీయాలో నీ కావురం జగతికెరుకే
సెర్బ్ స్త్రీలపై సైనిక అత్యాచారాలు
వియత్నాంలో విర్ర వీగుడు
అన్ని నాశనాలు నీ వినాశనానికే

ఆ నాలుగు విమానాలే నీ కిరీటం కింద రాల్చాయి
బిన్ లాడెన్ ఎవడైతేనేం ?
నీ అయ మెరిగి గాయం చేసాడు
మాన్‌సాంటో విత్తనాలతో
తెలంగాణాలో పత్తి రైతులను మింగావు
బషీర్‌బాగ్ తుపాకుల్లో దాగున్న
కన్పించని శత్రువు నీవు
నెనరు లేని అమెరికా
నీ పొగరు దిగిందా ?
నీ కనర్ వగిందా ?

2001 సెప్టెంబర్ 11 తెల్లవారి



www.etelangana.org

# స్వర్ణోత్సవ భారతీ !

తల్లీ భారతీ !
నీ స్వరం మారింది
నిన్ను కుదువ పెడుతున్నారు
ఐ.యం.ఎఫ్ నెత్తురుతో
నీ గళం కదులుతుంది
ప్రపంచీకరణ పేరుతో
సామ్రాజ్యవాదం కాళ్ళకు
సంకెల్లు వేసింది
ప్రపంచ బ్యాంక్ ఒప్పందాలతో
చేవ్రాలు బొటన వేలి ముద్ర అయ్యింది

స్వర్ణోత్సవ భారతీ !
అనాడు ఒక్క ఈస్టిండియా కంపెనీ
ప్రతిఫలం రెండు వందల ఏండ్లు
ఈనాడు వేలాది కంపెనీల పేరుతో
నిన్ను రైన్ పెడుతున్నారు తల్లి
నలబది ఏడు ఆగస్టులో
తెగినట్టే తెగిన నీ బంధనాలు
నల్లవాడి చేతిలో సవారి పగ్గాలయ్యాయి



దగుల్బాజీలంతా కలిసి
నీకంట్లో కారం చల్లారమ్మా
అమ్మా! స్వర్ణోత్సవ భారతీ !
ప్రపంచ మార్కెట్‌లో
నిన్ను టెండర్ పెట్టారమ్మా
నిన్ను డంకెల్ గాడికి అప్పగించారు
క్లింటన్, రెనడోరుగెరో, ఫాంక్ విస్నర్‌ల
మాయలో నిన్ను బందిని చేశారు
నీ వికృత రాజకీయ శిశువులు
పెద్దదేశాల్లో నీకు పట్టె మంచం వేశారమ్మా

అమ్మా ! తల్లీ
ఇక్కడ రోడ్ కావాలంటే
ప్రపంచ బ్యాంక్‌కు మోకరిల్లాలి
ఇక్కడ బడి కావాలంటే
తెల్లవాడి పాదాలు నాకాలి
ఇక్కడ నీళ్ళు కావాలంటే
నెదర్లాండ్‌తో నేస్తం చేయాలి
తల్లీ స్వర్ణోత్సవ భారతీ
ఇక్కడ నీళ్ళలో అంకుల్ శ్యామ్
నల్ల రంగువేసి కొక్కొకోలాహలం సృష్టిస్తున్నాడు
మన తాతల వేప మందుకు
పెటెంట్ హక్కుదారుడు డంకెల్ గాడ?

తల్లీ స్వర్ణోత్సవ భారతీ
పల్లెసీమల్లో అంబా అనే లేగ దూడలు
చెంగు చెంగున లేచి



www.etelangana.org

అరబ్బుల పంటి క్రింద ప్రైముక్కలవుతున్నాయి
తల్లీ భారతీ
యాభై ఏండ్ల వయస్సులో
చావు సరళం అయ్యింది
చంపినోడిదే రాజ్యం అయ్యింది తల్లీ
కన్నీళ్లే మిగిలాయి తల్లీ భారతీ
అంతర్జాతీయ విపణిలో
తాకట్టు పడ్డ నిన్ను
విముక్తి చేసేందుకు
నీ పిల్లలు కదం తొక్కుతున్నారు
వర్ణాధిక్యం నుంచి భూస్వామ్యం దాక
పెట్టుబడుల నుంచి వర్గస్వామ్యం దాక
పోరాటం చేస్తున్నారు తల్లీ

లింగ బేధంపై ప్రశ్నలు
ప్రాంతధిక్యంపై ప్రశ్నలు
ప్రశ్నలు ప్రశ్నలు ప్రశ్నలు
ప్రశ్నల కొడవల్లతో
పార్లమెంట్ అసెంబ్లీ నుంచి
ఐ.యం.ఎఫ్. అమెరికా దాకా
దట్టించి ప్రశ్నించి
విముక్తం చేస్తాం
తల్లీ భారతీ

1997 పంద్రాగస్ట్ రాత్రి



# చిరునామా

నా దేశాన్ని
రత్నగర్భ, అన్నపూర్ణ అని
వేదికలెక్కి కక్కేది
ఎవడురా ?
ఆకలి చావుల కలహండీలు
కన్పించలేదా ?
ఎవడు నా దేశాన్ని రత్నగర్భ అంది
స్వర్ణ యుగమా, రామ రాజ్యమా?
ఏ యుగంలో ఏ రాజ్యంలో
సామాన్యుడు శౌర్యంగా బ్రతికాడు
రామరాజ్యం స్వర్ణయుగంలోను
దారిద్ర్యం, పేదరికమే లేదా?

ప్రజల్ని వంచించేందుకు
ఎందుకీ ఆత్మవంచన
స్వాతంత్ర్యం స్వాతంత్ర్యం అని
గొంతు చించుకునే మీరు
స్వతంత్రంగా జీవిస్తున్నారా
ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం అని
గాంధ్రు కప్పల్లా ఎందుకరుస్తారు
స్వేచ్ఛ సమభావం అని
మైకుల్లో అరిచే మీరు
మీ పెళ్ళాలకు స్వేచ్ఛ నివ్వగలరా



www.etelangana.org

నెత్తురోడుతున్న బిడ్డల్ని
మీరేమనగలరు?
జవాబ్ దేవో
హత్యను హత్యేనని
నేరాన్ని నేరమనే స్వేచ్ఛ ఉందా ?
స్వేచ్ఛగా రాసివ్వ గలవా!

ఏది మీ స్వేచ్ఛ
ఎందుకు మీ స్వకుచ మర్ధనం
హక్కులు చట్టాలంటూ
అంగలార్చే మీరు
ఆర్టికల్ 21 ప్రకారం జీవిస్తున్నారా!
మోసం, దగాలతో
ఆస్తుల్ని, ఆక్టోపస్‌లా
పెంచుకోవడం
కీర్తి కుతుల్ని, తీర్పు కోవడమే కదా
మీ బతుకు
మెదల్లు వెన్నెముకల్లేని మీరు
నా దేశాన్ని, ఎడ్ల బండ్లో వెనక్కి తెస్తున్నారు
అందుకే
మేహం మారణ హోమం
పంజాబ్ కాశ్మీర్‌లలో కల్లోలం
భోఫోర్స్ బొంకులతో
బోపాల్ కన్నీల్లతో
ఇంకింది నా దేశం

1988



## ఆత్మ వంచనాసదృశ్యం

కుళ్ళికంపు కొడుతున్న
పాత రోజుల్ని చూస్తూ
తిరిగి అవే పునరావృతమవుతుంటే
నూతనత్వం భ్రమతో



www.etelangana.org

ఆహ్వానించడం దేనికి
ఆత్మవంచనా సదృశ్యంతో
ఆనందించడం దేనికి

విష సంస్కృతి విస్తరించిన దౌర్జన్య వ్యవస్థలో
జలియన్ వాలాబాగ్, బోపాల్ ఇంద్రవెల్లి
కారంచేడు నీరుకొండ, చింతపెల్లి ఘటనల
పునరావృతమే కదా చరిత్ర సారాంశం
రూప్ కన్వర్ చితి మంటల వెలుతురు
కిరసనాయిలు మంటల్లోని స్త్రీలశవాల రోదన
మొనాస్టరీ నన్స్‌ల లోక కళ్యాణపు చీకటి మత్తు
రాజకీయ నాయకులు ఓ(నో)ట్లు లెక్కిస్తున్న వేల
రాజ్యాంగపు పుటలపై
కరుకు బూట్ల గాట్లు
పడుతూనే ఉంటాయి
ఆకలి కేకలతో పేగులు వడివడి
చస్తూనే ఉంటారు
నిరుద్యోగపు ఉరిత్రాడుపై
యువకుల తలలు వేలాడుతుంటాయి
రేప్‌లు, ఖూనీలు, దోపిడీలు
నేరాలు పెరిగి పోతుంటాయి
ఇటువంటి రోజుల్నా
మనం ఆహ్వానించేది
ఇటువంటి దినాల్లోనా
మనం బతుకుతున్నది

1989



# యాది.....

నా ఎదుగుదలను కాంక్షిస్తూ నిరంతరం ప్రేమిస్తూ ఆశీర్వదిస్తున్న అమ్మా నాన్నలకు ముందుగా నమస్సుమాంజలులు.

చదవడము, రాయడము సామాజిక విషయాల పట్ల అవగాహన ఆలోచన 1980 కన్నా ముందు నుంచే ఉంది. శ్రీశ్రీ, చెర, శివసాగర్‌ల పుస్తకాలు చదివిన తర్వాత మార్గాన్ని ఏర్పరుచుకునే క్రమంలో నాకూ కవిత్వం పట్ల ఆసక్తి కల్గింది. 1985-1998 లో పాత్రికేయునిగా పనిచేస్తున్న కాలం అంతా తరుముతున్న జీవితమే అప్పుడప్పుడు రాసుకొని దాసుకొని మురిసినదే. అయినా 1997లో తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట యోధుడు మేరమల్లేశం పాటలు సేకరించి సంకలనం వేశాను.

1992లో బి.యస్ రాములుగారి పరిచయంతో సాహిత్యంలో సీరియస్‌నెస్ పెరిగింది. కవిత్వాన్ని అంతా కూర్చి పుస్తకం వేయాలని ప్రోత్సహించారు. కవిత్వమే కాదు కథలు రాయమని వెంటపడి నన్ను కథకుణ్ని చేశారు.

ఈ కవిత్వాన్ని సవరించ్చి పేరు పెట్టింది జూకంటి జగన్నాధం. సాహిత్యంపట్ల ఆసక్తిని పెంచుతూ నా వెన్నుతట్టి మార్గదర్శకులుగా ఉన్న దర్భశయనం శ్రీనివాసాచార్య, మలయశ్రీ, గుడిపాటి, అల్లంనారాయణ, నందిని సిధారెడ్డి, కాలువ మల్లయ్య, కె.వి. నరేందర్‌లకు ఆత్మీయాభివందనాలు.

నిరంతరం నన్ను అభినందిస్తున్న సాహిత్య మిత్రులు, పెద్దలు దేవులపల్లి అమర్, బి. విజయ్‌కుమార్, వఝుల శివకుమార్, అనిశెట్టి రజిత, నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్ శమశ్రీ, గోపులింగారెడ్డి, జి. లక్ష్మణ్‌రావు, శ్రీరంగస్వామిలకు కృతజ్ఞతలు.

హుస్నాబాద్‌లో సాహిత్య వాతావరణం నెలకొనడంలో నూతన సాహితి ఆవిర్భావంలో సహదేవ్‌ను మరవలేము. ఇక్కడి సాహిత్య మిత్రులు దార్లరామచంద్ర, శ్రీ దాస్యం లక్ష్మయ్య, వడ్డేపల్లి మల్లేశం, రేబల్లి వెంకటేశ్వర్లు, కోహెడ కొమురయ్య, రుద్రవరం ఎల్లయ్య, కామారపు విశ్వనాధం, పిట్టల తిరుపతి ఇతర మిత్రులందరికీ ధన్యవాదాలు.

ఈ 'తొవ్వ' వెలుగు చూడడానికి కృషి చేసిన మా ఎమ్మీవో సుద్దాల చంద్రయ్యకు వందనాలు.

సాహిత్యతోవ సాఫీగా సాగడానికి సహకరిస్తున్న నాలో సగం రాజేశ్వరి, పుస్తకం తీస్తున్నానగానే ఆనందించిన చెల్లెళ్లు సుజాత, మణిమాల, బావలు, తమ్ముడు శ్రీనివాస్, డాడీ మీ బుక్కేది? అని ఎదిరిచూసే పిల్లలు స్వాతి, గౌతం అందరికీ అభినందనలు. ముఖ చిత్రాన్ని అందంగా రూపొందించిన అక్బర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

నూతన సాహితి, దరకమే వేదిక, సాహితీ గౌతమి, మంజీర, జన జాగృతివేదిక, స్ఫూర్తి, మిత్రులందరికీ పేరు, పేరునా నా వందనాలు.

www.etelangana.org